సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 26 । మే । 2025



దర్గాగా కబ్జా

శ్రీకూర్మంలో దర్గాగా కబ్జా జరుగుతోంది. అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు.

- 8లో



ఆన్‌లైన్ వైద్యంతో అనర్థం

ఆన్‌లైన్ వైద్యం ప్రాణాల మీదకు తెస్తోంది. డాక్టర్లను సంప్రదించడం లేదు.

- 8లో

న్యూస్‌రీల్

బొడ్డపాడులో అమరవీరుల స్మారక సభ రేపు

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద మంగళవారం ఉదయం 10గంటలకు జిల్లా అమరవీరుల స్మారక సభ నిర్వహిస్తున్నట్టు అమరవీరుల స్మారక సభ నిర్వాహక కమిటీ కన్వీనరు జోగి కోదండ రావు ఓ ప్రకటనలో తెలిపారు. 1969 మే 27న అప్పటి జిల్లా నాయకులు పంచాది కృష్ణ మూర్తితో పాటు ఆరుగురు విద్యార్థి యువజన నాయకులు పోలీసు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కంచిలి మండలం జలంత్రకోటలో మృతి చెందారన్నారు. 55 ఏళ్ల తర్వాత ఇదే జిల్లాకు చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుకూడా ఇదే నెలలో పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని తెలిపారు. అమరవీరులకు నివాళులర్పించడం ఈ ప్రాంత ప్రజల కనీస ధర్మమని, అందుకే ఈ స్మారక సభ నిర్వహిస్తున్నామని, సభను విజయ వంతం చేయాలని కోదండ రావు కోరారు.

మృతదేహాలు అప్పగించకపోవడం అన్యాయం

కాశీబుగ్గ: చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా ఏపీకి చెందిన మరో ఇద్దరి మృతదేహాల్ని వారి బంధువులకు ఆదివారం సైతం అప్పగించకపోవడం అన్యాయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీతో మృతదేహాల కోసం శనివారం కేశవరావు సోదరుడు నారాయణపూర్ వెళ్లారని, ఆదివారం రాత్రి 6 గంటల వరకు నిరీక్షించినా ఫలితం లేదన్నారు. ఏపీ పోలీసు అధికారుల ఒత్తిళ్ల కారణంగానే మృతదేహాలు ఇవ్వడం లేదనే విషయం అర్థమవుతోందన్నారు. ఈ వైఖరిని ఖండిస్తున్నామని వారు తెలిపారు. వెంటనే ఏపీ హైకోర్టు స్పందించి మృతదేహాల్ని వారి బంధువులకు అప్పగించడానికి చొరవ తీసుకోవాలని కోరారు.

బదిలీపై టీచర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల్లో సీలింగ్ కోత వల్ల తమకు తీవ్రమైన నష్టం జరుగుతోందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పనిచేసిన గరిష్ఠ కాలానికి మొత్తం స్టేషన్ పాయింట్లను ఎలాంటి సీలింగ్ లేకుండా ఇప్పించాలని కోరారు. ఇదే విషయమై డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే అంతా జరుగుతుందని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మేలు జరిగేలా చూస్తామని డీఈఓ హామీ ఇచ్చినట్టు టీచర్లు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి సమాచారం తెలుసుకోవాలంటే 1100కు నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీగ లాగారు.. డొంక కదిలింది

శ్రీకాకుళం క్రైమ్ : బెట్టింగ్ మాఫియా తీగ పోలీసుల చేతికి చిక్కడమే కాదు.. డొంక కూడా కదిలింది. ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ పోలీసుల సాయంతో శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, ఒకటో పట్టణ పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. వీరితో నగదు లావాదేవీలు, ఫోన్ సంభాషణలు, సంక్షిప్త సందేశాలు చేసిన మరో ముగ్గురితో పాటు ప్రధాన బుకీగా ఉన్న విశాఖపట్నానికి చెందిన డి.శ్రీనివాసరావు (శ్రీను) ఆచూకీ పోలీసులకు చిక్కింది. బెట్టింగ్ ద్వారా జరిగిన నగదు లావాదేవీలన్నీ శ్రీను భార్య ద్వారానే జరిగిందని కనిపెట్టడమే కాకుండా ఆదివారం ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసులకు విచారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి శ్రీను ఒడిశాలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

సాధకుడికి స్వాగతం



వెంకటేష్‌కు గజమాలతో సన్మానం

- సివిల్స్ విజేత బాన్న వెంకటేశ్‌ను ఆత్మీయంగా స్వాగతించిన అల్లాడపేట
- 'అల్లాడ ముద్దుబిడ్డ' అంటూ ఘనంగా సత్కారం



వెంకటేశ్‌ను ఊరేగింపుగా స్వాగతిస్తున్న గ్రామస్తులు

తన ముద్దుబిడ్డను అల్లాడపేట ఆత్మీయంగా స్వాగతించింది. జనమంతా తోడు రాగా సాధకుడికి జేజేలు పలికింది. దేశ అత్యున్నత సర్వీసుకు ఎంపికైన సందర్భంగా అల్లాడపేట వాసులంతా బాన్న వెంకటేష్‌కు ఆదివారం సాదరంగా ఆహ్వానం పలికి సగౌరవంగా సత్కరించారు. మొదటి ప్రయత్నంలో విజయం అంచులు వరకూ వెళ్లి, రెండో ప్రయత్నంలో ఐపీఎస్, మూడో ప్రయత్నంలో ఏకంగా జాతీయస్థాయిలో 15వ ర్యాంక్‌ను వెంకటేష్ సాధించారు. ఓ వైపు ఐపీఎస్ శిక్షణ తీసుకుంటూనే మరో వైపు ఐఏఎస్ సాధనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా చదివారు. ఆయన సాధించిన అపురూప విజయంపై అల్లాడపేట పులకరించి పోయింది. ఆయన ఆదివారం గ్రామానికి రావడంతో ఊరూవాడా ఒక్కటై మంగళవాయిద్యాల నడుమ పూల వర్షం కురిపించారు. పూర్ణకుంభంతో వెంకటేష్‌కు ఊరిలోకి స్వాగతం పలికారు. ఊరివారందరినీ వెంకటేష్ వరసలు పెట్టి పిలుస్తూ ఆత్మీయంగా పలకరించారు. రామాలయం, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నా విజయం మా తల్లిదండ్రులకు అంకితం

అల్లాడపేట గ్రామస్తులు చేసిన పౌర సన్మానంలో వెంకటేశ్ మాట్లాడుతూ అత్యున్నత సర్వీసైన ఐఏఎస్‌కు ఎంపికయ్యానని, దీని వెనుక తన తల్లిదండ్రులు రోహిణి, చంద్రరావుల కష్టం ఎంతో దాగి ఉందని వినమ్రంగా చెప్పారు. తాను ఎంత పెద్దస్థాయికి ఎదిగినా ఎల్లకాలం వారికి రుణపడి ఉంటానని చెప్పారు. ఈ విజయం తల్లిదండ్రులకు అంకితం అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్యాణం చిన్నమ్మడు, జెడ్పీటీసీ మెండ విజయ శాంతి, గ్రామ పెద్దలు మెండ రాంబాబు,కల్యాణం శ్రీనువాసరావు, రిటైర్డ్ జడ్జి ఎం.రామకృష్ణ, వెలమ సంక్షేమ ప్రతినిధులు డాక్టర్ చక్క నారాయణరావు, ధర్మాన రఘునాథరావు, దుంగ సుధాకర్ బట్నా, కృష్ణ మూర్తి, ముద్దా అప్పలనాయుడు, వెలమల సత్యనారాయణ, ముద్దాడ వెంకట అప్పల నాయుడు, నక్క లక్ష్మణరావు, వెలమల మురళీ, ముద్దాడ జోగారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్, ఆయన తల్లిదండ్రులను అభినందిస్తున్న గ్రామస్తులు

ఇష్టంతో చదివితే ఏదైనా సాధ్యమే

గ్రామానికి వచ్చిన అనంతరం వెంకటేష్ మీడియాతో మాట్లాడారు. గ్రామీణ యువత సివిల్స్ సాధించాలంటే ముందుగా తల్లిదండ్రులకు భారం కాకుండా ఉపాధి వెతుక్కోవాలని మార్గనిర్దేశం చేశారు. తనకు క్రికెట్ అంటే ఎంతో ఇష్టమని, జాతీయ స్థాయిలో ఆడేందుకు కూడా ప్రయత్నించానని తెలిపారు. కానీ క్రికెట్ ఆడి డబ్బులు సంపాదించడం కంటే సివిల్స్ సాధించి పేదలకు సేవ చేయడం మంచిదని నమ్మి ఈ మార్గం ఎంచుకున్నానని వివరించారు. మన జిల్లా వ్యవసాయాధారిత జిల్లా అని, మన వెనుకబాటు రూపుమాపాలంటే చదువు ఒక్కటే మార్గమని సూచించారు. ఇష్టంతో ప్రణాళికాబద్ధంగా చదివితే సాధైనా సాధ్యమేనని అన్నారు.

-జలుమూరు

అమ్మమ్మ ఊరిలోనూ సత్కారం

నరసన్నపేట: సివిల్స్ ర్యాంకర్ బాన్న వెంకటేష్‌ను తన అమ్మమ్మ ఊరు బసివలసలో సత్కరించారు. గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరంగి శ్రీను, వెంకటేష్ మేనమామలు ఢిల్లీశ్వరరావు, రుద్రడులు, అమ్మమ్మ నర్సమ్మ , పాగోటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కరకట్టలేరా..?

నైరుతి కబురు అందింది. చినుక రాక ఇహనో.. ఇప్పుడో అన్నట్టు ఉంది. తడారిపోయి ఎడారిలా కనిపిస్తున్న వంశధార, నాగావళికి ఇది తీపి కబురే. కానీ పరివాహక ప్రాంత వాసులు మాత్రం చినుకు పేరు చెబితేనే వణికిపోతుంటారు. ఏటా వానాకాలంలో ఈ రెండు నదులకు వరదలు రావడం.. ఏ అర్ధరాత్రి పూట ఏరు ఊరి మీదకు వస్తుందోనని నిద్రలేని రాత్రిళ్లు గడపడం వీరికి అలవాటైపోయింది. వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన కరకట్టల నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో ఏటా ముంపు భయం తప్పడం లేదు.



కుంటిభద్ర వద్ద కోతకు గురైన వంశధార

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

- కరకట్టల కోసం ఎదురు చూస్తున్న వంశధార, నాగావళి
- నదీ తీర ప్రాంత వాసులకు ఏటా తప్పని ముంపు భయం
- వైఎస్సార్ హయాంలో ప్రారంభమైనా.. పూర్తి కాని కరకట్టల నిర్మాణం

జిల్లాకు వంశధార, నాగావళి జీవ నదులు. కానీ ఈ నదుల తీర ప్రాంత వాసులు మాత్రం జూన్ నుంచి దాదాపుగా నాలుగైదు నెలల పాటు భయం భయంగా గడుపుతారు. కూటమి నేతలు సభలు, సమావేశాల్లో గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో పనులేవీ జరగడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపుగా ఏడాదవుతున్నా ఇప్పటికీ కరకట్టల నిర్మాణాల ప్రస్తావనే లేదు.

నాగావళి వరద కట్టల పరిస్థితి ఇదీ..

జిల్లాలో నాగావళి వీరఘట్టం(ఇప్పటి మన్యం-పార్వతీపురం జిల్లా) మండలంలోని చిలకాపల్లి నుంచి శ్రీకాకుళం మండలం కల్లేపల్లి వరకు సుమారు 110 కిలోమీటర్ల మేర ఉంది. ఈ తీర ప్రాంతానికి ఆనుకుని వందలాది గ్రామాలు, సుమారు 18వేలు ఎకరాలు సాగవుతున్నాయి. వరదలు వస్తే ఎక్కువగా పాలకొండ మండలంలో అంపిలి, అన్నవరం, గోపాలపురంతో పాటు మన జిల్లాలో బూర్జ మండలంలో లాభాం, బూర్జ, కాఖండ్యాం, ఆమదాలవలస మండలంలో దూసి, తొగరాం, ముద్దాడపేట, దూసిపేట, తోటాడ, ఇసుకలపేట, శ్రీకాకుళం మండలంలో బలగ, హయాతీనగరం, ఫాజుల్‌బాగ్‌పేట ఏటా దెబ్బ తింటాయి. వైఎస్సార్ హయాంలో 2007లో రూ.70.825 కోట్లతో కరకట్టల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో పనులు శరవేగంగా జరిగాయి. ఆయన మరణం తర్వాత పనులు మందగించాయి.

భూ సేకరణ పేరుతో జాప్యం

నాగావళి నది వరద కట్టలకు మొత్తం కావాల్సిన భూమి 253 ఎకరాలు కాగా.. అందుకు గాను ప్రస్తుతం పనులు చేసేందుకు అవసరమైనది 245 ఎకరాలుగా ప్రతిపాదించారు. ఈ 15 ఏళ్లలో కేవలం 103.51 ఎకరాలు మాత్రమే భూ సేకరణ జరిగింది. మిగిలిన 141.49 ఎకరాలు భూమి భూసేకరణ పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు భూసేకరణకు రూ.4.02 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాల్లో, ఐఏబీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడినా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది.

పనుల స్థితి..

నాగావళిలో మట్టి పనులు మొత్తం చేయాల్సినవి 51.88 కిలోమీటర్ల పనులకు గాను 17.35 కిలోమీటర్లు పనులు పూర్తి చేశారు. కాంక్రీట్ పనులు 3.185 కిలోమీటర్లకు గాను 1.685 కిలోమీటర్లు పూర్తిచేసినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి.

వంశధారలో ఇలా..

జిల్లాలో వంశధార భామినితో పాటు కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, శ్రీకాకుళం, గార మండలాల్లో సుమారు 82 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. మన్యం-పార్వతీపురం జిల్లా భామిని మండలం బత్తిలి మొదలుకుని గార మండలం వరకు అనేక గ్రామాలు చినుకుపడితే వణికి పోతున్నాయి. పనులు సులభంగా పూర్తి చేసేందుకు గాను వంశధార కరకట్టల పనులను నాలుగు ప్యాకేజీలుగా విడగొట్టారు.

భామిని మండలం బత్తిలి గ్రామం నుంచి కీసరి వరకు కొత్తూరు మండలం సిరుసువాడ గ్రామం నుంచి ఆకులతంపర వరకు వంశధార-1 కింద కరకట్టల నిర్మాణానికి 2007-08లో రూ.38.5 కోట్లకు పనులు ప్రారంభించారు. వంశధార-2 ప్యాకేజీలో హిరమండలం మండలం రుగడ గ్రామం నుంచి కరకవలస వరకు వంశధార ఎడమ వైపు, గులుమూరు గ్రామం నుంచి స్కాట్‌పేటవరకు కుడివైపు కరకట్టల నిర్మాణం పనులకు గాను 2007లో రూ.27.29కోట్లు అంచనా విలువతో ప్రారంభించారు. వంశధార-3 ప్యాకేజీలో ఎల్ఎన్‌పేట మండలంలో స్కాట్‌పేట నుంచి ఆమదాలవలస మండలం చవ్వాకుపేట వరకు, శ్రీకాకుళం మండలం నవనంబాడు, గార మండలంలో కళింగపట్నం వరకు నదికి కరకట్ట పనులు విస్తరించి ఉన్నాయి. వంశధార ప్యాకేజీ-4 పనులు జలుమూరు మండలం కరకవలస నుంచి పోలాకి మండలం పల్లిపేట వరకు నదికి ఎడమవైపు చేసేందుకు నిర్ణయించారు. అన్ని పనులు మొదలైనా పూర్తి కాలేదు.



బూర్జ గ్రామం వద్ద గట్టు లేక సమాంతరంగా ఉన్న నాగావళి తీరం

చర్యలు చేపడతాం



వంశధార, నాగావళి కరకట్టల పరిధి నదీతీర ప్రాంత గ్రామాల్లో అత్యంత ప్రమాదకరమైన పాయింట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపించాం. వాటిని అంచనాలు తయారుచేసి పంపించాం. ఇప్పటివరకు ఇంకా నిధులు మంజూరు చేయలేదు. ఇప్పుడున్న నదుల గట్లతో 80 నుంచి 90 క్యూసెక్కులు వరద నీరు వస్తే ప్రమాదం ఏమీ ఉండదు అంతకన్నా ఎక్కువైతే మాత్రం ప్రమాదం తప్పదు. పనులు చేసేందుకు చర్యలు చేపడతాం. **– పొన్నాడ సుధాకర్, జలవనరుల శాఖ ఈఈ, శ్రీకాకుళం జిల్లా**

చినుకు పడితే ఇబ్బందే



ఏటా వర్షాకాలం వచ్చిందంటే గ్రామంలో ప్రజలంతా బిక్కుబిక్కుమంటారు. రెండు రోజులు వర్షం కురిస్తే పొలాల్లోకి నీరు వచ్చేస్తుంది. నాగావళి నది పక్కనే ఉండడం మాకు శాపంగా మారింది.

– కె.శ్రీనివాసరావు, బూర్జ

గట్లు బలహీనపడ్డాయి



వంశధార ప్రాంతంలో చాలాకాలంగా కరకట్టల పనులు ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. ఇంత వరకు వేసిన గట్లు కూడా బలహీనపడ్డాయి. ఇసుక వాహనాలు ఇవే గట్లపై వెళ్తుండడంతో మరింత బలహీనపడ్డాయి. **– ఎస్.వైకుంఠరావు, మిరాయిపల్లి, ఎల్ఎన్‌పేట మండలం**

ఎందుకంత ఆదరాబాదరా..?



శ్రీకాకుళం న్యూకాలనీ:

ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియను ఆదరాబాదరాగా చేపడుతుండటంతో టీచర్లకు పాట్లు తప్పడంలేదు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ఆఖరిదశకు చేరుకుంది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ తీరుపై స్పష్టత రాకపోవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సీలింగ్‌లో నాడు మేలు-నేడు కీడు..

చాలా మంది టీచర్లు ప్రస్తుతమున్న పాఠశాలలో అనేక ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ గరిష్ఠంగా 8 ఏళ్లకు మాత్రమే ప్రభుత్వం పాయింట్లు కేటాయిస్తుంది. మిగిలిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ అనేక ఏళ్లుగా మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లకు కూటమి సర్కారు తీరని అన్యాయం చేస్తోంది. వీరంతా సుమారు ఆరేడు పాయింట్లు కోల్పోతున్నారు. 2023లో ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయంతో సీలింగ్ విధానాన్ని ప్రభుత్వం ఎత్తి వేసింది. దీంతో నాడు ఎంతోమంది టీచర్లకు మేలు జరిగింది. నేడు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా తయారైంది. బదిలీ దరఖాస్తు గడువు పొడిగించాలని టీచర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్వర్ సరిగా పనిచేయడం లేదని, అనేక సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లు అప్‌లోడింగ్ తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. 2014 డీఎస్సీ అభ్యర్థులకు పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్‌జీటీల కౌన్సెలింగ్ తీరుపై సందేహాలు..

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ మొదలైనప్పటికీ సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ) కౌన్సెలింగ్ ఎలా నిర్వహించాలన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంపై ఎన్నో సందేహాలు తలెత్తుతున్నాయి. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినప్పటికీ బదిలీల కౌన్సెలింగ్ మాత్రం ఆఫ్‌లైన్ ద్వారానే చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఎస్‌జీటీలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్జీటీలు జూన్ 7 నుంచి 10వ తేదీ లోపు ఆప్షన్ ఇచ్చుకుంటే జూన్ 11వ తేదీన బదిలీ ఉత్తర్వులు ఆన్‌లైన్ ద్వారానే వెలువడతాయని మార్గదర్శకాల్లో ఉండటం గమనార్హం.



ఉపాధ్యాయులు (ఫైల్)

ఎంటీఎస్ టీచర్లకు తీవ్ర అన్యాయం..

తాజా సాధారణ ఉపాధ్యాయ బదిలీల్లో 1998 డీఎస్సీతో పాటు 2008 డీఎస్సీ మినిమం టైమ్ స్కేల్ టీచర్లు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. వారు పనిచేస్తున్న పోస్టులను ఖాళీల జాబితాలోకి తీసుకురావడంతో వారి పోస్టులు గల్లంతయ్యాయి. అలాగే దంపతులిద్దరూ ఉద్యోగులైతే బదిలీల్లో ఎవరో ఒకరికి స్పౌజ్ పాయింట్లు ఇస్తారు.

అయితే 1998 డీఎస్సీతో పాటు 2008 డీఎస్సీలో అన్యాయానికి గురైన టీచర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిన వారికి ఉద్యోగాలు కల్పించారు. వీరిలో 70 నుంచి 80 శాతం మంది పదవీ విరమణ దశకు చేరుకున్నారు. అయితే వీరి భార్య లేదా భర్త ప్రభుత్వ ఉద్యోగి అయితే వారికి కచ్చితంగా బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు కేటాయించాలి. కానీ కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లను ఇప్పటికీ తమ వ్యతిరేకులుగానే చూస్తోంది. కేజీబీవీల్లోని టీచర్లకు స్పౌజ్ పాయింట్లు కేటాయిస్తున్నప్పటికీ, ఎంటీఎస్ టీచర్లకు మాత్రం మొండిచేయి చూపుతుండటాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు.



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

సీనియారిటీ పాయింట్లను సరి చేయాలి



బదిలీల్లో అన్ని కేటగిరీ టీచర్లకు మాన్యువల్‌గానే కౌన్సెలింగ్ చేపట్టాలి. 8 ఏళ్లు పూర్తి చేసుకున్నవారికి సీనియారిటీ పాయింట్లను కేటాయించాలి. 117 జీఓ ద్వారా పదోన్నతిపై వెళ్లిన టీచర్లకు న్యాయం చేయాలి.

– బమ్మిడి శ్రీరామ్మూర్తి, యూటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆదరాబాదరాగా బదిలీలు సరికాదు..



అంతా గందరగోళంగా ఉంది. ఆగమేఘాల మీద చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఎన్నో సందేహాలు, సమస్యలు ఉన్నాయి. బదిలీలకు సంబంధించి సాఫ్ట్‌వేర్‌లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. రీ-అపోర్షన్ ప్రక్రియలో ఎవరు మిగులు టీచర్లుగా ఉన్నారో తెలియడంలేదు. ఆదరాబాదరాగా బదిలీలు చేపడుతుండటం సరికాదు.**– మజ్జి మదన్‌మోహన్, ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు**

ఎలాంటి అపోహలు అవసరం లేదు



జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఖాళీల జాబితాలను సిద్ధం చేశాం. సీనియారిటీ జాబితాలను సిద్ధం చేస్తున్నాం. ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదు. నిర్దేశించిన గడువులోపు టీచర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. **– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం**

మహిళలపై నోరు పారేసుకుంటున్న రూరల్ సీఐ తిరుపతిరావు



మాజీ మంత్రితో వాగ్వాదం చేస్తున్న సీఐ తిరుపతిరావు



ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్..?

పోలీస్‌స్టేషన్‌కు ఎవరు వచ్చినా గౌరవంగా పలకరించాలని, స్నేహపూర్వకంగా మెలగాలని ఉన్నతాధికారులు తరచూ చెబుతూ ఉంటారు. కానీ పోలీసులు ఆ సూచనలు పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. ఆదివారం వజ్రపుకొత్తూరు మండలం పోలీసుస్టేషన్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన కూటమి ప్రభుత్వంలో విపక్షాలపై ఖాకీల వైఖరిని మరోమారు తేటతెల్లం చేసింది. తన గొర్రెల శాలను కూల్చేశారని గూడ ధనరాజ్ అనే బాధితుడు మొర పెట్టుకుంటే అతని ఫిర్యాదును స్వీకరించలేదు. శాలను కూలగొట్టిన వారి ఫిర్యాదును మాత్రం తీసుకుని బాధితుడిని ఓ రోజంతా స్టేషన్‌లో ఉంచారు. విషయం తెలుసుకుని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు వెళ్లి మాట్లాడగా.. కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు రెచ్చిపోయారు. పత్రికల్లో రాయలేని పదాలతో దుర్భాషలాడారు. సీదిరి అప్పలరాజు రాష్ట్రానికి ఐదేళ్లు మంత్రిగా సేవలు అందించారు. కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార, మూలపేట పోర్టు వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయనను కనీసం గౌరవించకుండా సీఐ ప్రవర్తించిన వైఖరిని అక్కడున్న వారంతా ఖండించారు. కూటమి ప్రభుత్వంలో నాయకులకే గౌరవం లేకపోతే సామాన్యులకు ఇంకేం గౌరవం ఉంటుందని అన్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు

క్లుప్తంగా

పీజీ సెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ పీజీసెట్ – 2025 దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో ముగిసింది. ఏపీ పీజీ సెట్ ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు కల్పిస్తారు. మార్చి 31 నుంచి దరఖాస్తులు స్వీకరణ మొదలైన సంగతి తెలిసిందే. ఈ నెల 30 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

సాహితీమూర్తి పులఖండం



మాట్లాడుతున్న జి.వి.స్వామినాయుడు

గార: గొప్ప సాహితీమూర్తి డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. ఆదివారం గార మండలం వాడాడ జంక్షన్‌లోని కల్యాణ మండపంలో విద్వాన్ బంకుపల్లి రమేష్‌శర్మ అధ్యక్షతన జరిగిన పులఖండం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఐఎస్‌వో, నాక్ వంటి సంస్థల గుర్తింపు వెనుక ఆయన కృషి ఉందన్నారు. అనంతరం కరస్పాండెంట్ రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.సత్యనారాయణ, డాక్టర్ ఎం.కృష్ణ, విశ్రాంత డీఎస్పీ భార్గవరావు నాయుడు, డాక్టర్ డి.విష్ణుమూర్తి, మేజర్ వంగ మహేష్, ఉపనిషన్మందిరం కార్యదర్శి నిష్టల నరసింహమూర్తి మాట్లాడుతూ పులఖండంతో గల అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గురజాడ సంస్థల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



షీటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న పాత నేరస్తులు, సస్పెక్ట్ షీటర్లకు వివిధ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతుండటంతో పాటు పేకాట శిబిరాలు ఎక్కడ పడితే అక్కడ నడుస్తుండటంతో వారం వ్యవధిలో రెండోసారి కౌన్సిలింగ్ ఇచ్చారు.ఎస్పీ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ దాడులు సైతం ముమ్మరం అయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ పైడపునాయుడు షీటర్లకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

సేవలు మరింత విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సంస్థల సేవలు మరింత విస్తృతం కావాలని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు కోరారు. జిల్లా కేంద్రంలోని బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి మందిరంలో జిల్లా స్థాయి సత్యసాయి సేవా సంస్థల పదాధికారులు, కన్వీనర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నారాయణసేవ, గ్రామ సేవా మహాయజ్ఞం, కోటి మొక్కల పెంపకం, రిమ్స్, టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రులలో నిర్వహిస్తున్న నిత్య నారాయణ సేవలపై సమీక్షించారు. కార్యక్రమంలో సమితి, భజన మండలి కన్వీనర్లు, సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిల్లిపాలెంలో ఆదివారం ఓ గృహంలో పేకాడుతున్న ఆరుగురిని శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.79,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నాలుగు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు కుడా స్వాధీనం చేసుకున్నారు. కాగా, శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఇటీవల కాలంలో పేకాట, బెట్టింగ్ వంటి వ్యవహారాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రూరల్ పోలీసులు మాత్రం వీటిపై నోరు మెదపడం లేదు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముందస్తుగా సమాచారం సేకరించడంతో పాటు నేరస్తుల కదలికలు పసిగట్టడం, పేకాడుతున్న వారిని పట్టుకోవడంలో దూకుడుగా ఉంటున్నారు. రూరల్ పోలీసులు మాత్రం ఇటువంటి కేసుల్లో చాలా గోప్యత పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఆదివారం పేకాటరాయుళ్లు పట్టుబడిన విషయమై రూరల్ ఎస్‌ఐ వద్ద ప్రస్తావించగా అటువంటి కేసులు ఏమీ నమోదు కాలేదని, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెళ్లారని, వారు పట్టుకొని వస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యలో.. బదిలీల పర్వం



శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

- ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందికి స్థాన చలనం
- జీఓ నంబర్ 23తో మార్గదర్శకాలు విడుదల



స్పాట్ వాల్యుయేషన్‌లో నిమగ్నమైన లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యతోపాటు ఇంటర్మీడియెట్ విద్యలోనూ బదిలీల పర్వానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి జీఓ నంబర్ 23తో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఈ నెల 22 నుంచి మే 8వ తేదీలోగా బదిలీలను పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించింది. ఒకే చోట ఐదు అకడమిక్ విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉద్యోగులు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు కటాఫ్ తేదీగా 2025 మే 31గా నిర్ణయించారు. జూన్ 1 నుంచి మే 31 వరకు అకడమిక్ సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో తొమ్మిది నెలల సర్వీసు పూర్తి చేసుకున్నా సంవత్సరంగానే లెక్కిస్తారు. బోధనేతర సిబ్బంది, లెక్చరర్ల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా చేపడతారు.

రిక్వెస్ట్ బదిలీలకూ ఛాన్స్..

కనీసం రెండు విద్యా సంవత్సరాలు (2023-24, 2024-25) పూర్తిచేసుకున్నవారు సైతం రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. ఏవైనా చార్జీలు/విజిలెన్స్ కేసులు/పోక్సో కేసులు ఉన్న ఉద్యోగుల బదిలీ అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోరు. బదిలీల్లో దివ్యాంగ ఉద్యోగుల తీవ్రత బట్టి పాయింట్లను కేటాయించగా.. వారు కోరుకుంటేనే బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది కలిపి 110 మంది వరకు దరఖాస్తు చేయొచ్చని అంచనా వేస్తున్నారు. అన్ని కళాశాలల్లోనూ కనీస రెగ్యులర్ సిబ్బంది ఉండేలా పోస్టులను బ్లాక్ చేస్తారు.

పనితీరుకు పాయింట్లు..

బదిలీల్లో ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లకు వారి పనితీరు ఆధారిత పాయింట్లను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఆర్‌ఏకు, విద్యార్థుల స్ట్రెంత్‌కు, విద్యార్థుల ఫలితాలకు వేర్వేరుగా పాయింట్లను కేటాయించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల ఆధారంగా వీరికి పాయింట్లను ఇవ్వనున్నారు. 0 నుంచి-40శాతం ఫలితాలు వస్తే ఎలాంటి పాయింట్లూ ఉండవు. 41 నుంచి 60 శాతానికి రెండు, 61–80 శాతానికి నాలుగు, 81 నుంచి 100 శాతానికి ఆరు పాయింట్ల చొప్పున ఇస్తారు. ప్రిన్సిపాళ్లకు జనరల్, వృత్తివిద్యా కోర్సులను కలిపి చూస్తారు. హెచ్‌ఎస్‌ఏ 16 శాతంతో క్యాటగిరీ – ఏలో ఉన్నవారికి కేటగిరి–బీ, సీ, డీ ప్రాంతాలకు మారేందుకు అనుమతిస్తారు. హెచ్‌ఆర్‌ఏ 12 శాతంతో క్యాటగిరీ–బీలో ఉన్నవారు క్యాటగిరీ–ఏ, బీ, సీ, డీలకు వెళ్లొచ్చు. హెచ్‌ఎస్‌ఏ 10 శాతంతో క్యాటగిరీ–సీలో ఉన్నవారు అన్ని క్యాటగిరీలకూ మారేందుకు అవకాశం ఉంటుంది.

ఎన్నో సందేహాలు..

బదిలీల పర్వానికి సంబంధించి ఎన్నో సందేహాలు, మరెన్నో చిక్కుముడులకు ఉత్తర్వుల్లో ఎక్కడా సమాధానాలు లభించలేదని ఉద్యోగులు వాపోతున్నారు. చాలా చోట్ల పోస్టులను కుదింపు, కోర్సుల రద్దు పేరిట ప్రభుత్వం ఇష్టానుసారం చేపడుతున్న రేషనలైజేషన్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడం, మరోవైపు రేషనలైజేషన్‌లో పోస్టులను మరోచోటకు కేటాయింపుతో.. సగం పోస్టులను బ్లాక్ చేస్తుండటంతో అంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏం చేయాలో తెలియక, మార్గదర్శకాల్లో స్పష్టత లేక లెక్చరర్లు తలలు పట్టుకుంటున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే..



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటర్మీడియెట్ విద్యలో బదిలీలు పారదర్శకంగా జరుగుతాయి. ఇప్పటికే మార్గదర్శకాలు వెలువడ్డాయి. ఎవరూ ఎలాంటి ఆందోళన, దిగులు చెందనవసరం లేదు. ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టుగా అర్హులైన ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలి. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్ల పనితీరు ప్రకారం పాయింట్ల కేటాయింపు జరిగింది.

– ఆర్.సురేష్‌కుమార్, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి, శ్రీకాకుళం

దర్జాగా కబ్జా!

- యథేచ్ఛగా పంచాయతీ రిజర్వుడు స్థలాల ఆక్రమణ
- శ్రీకూర్మంలో రెండు చోట్ల నిర్మాణాలు
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు



పంచాయతీ రిజర్వు స్థలంలో ఇంటి నిర్మాణం



పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో నిర్మాణం జరుగుతున్న దృశ్యం

గార : మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో పంచాయతీ రిజర్వుడు స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ఏకంగా నిర్మాణం జరుగుతున్నా పంచాయతీ, రెవున్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకూర్మం గ్రామంలో సర్వే నెంబరు 600లో 8.5 సెంట్ల పంచాయతీ రిజర్వు స్థలం ఉంది. వీటిలో టీడీపీ సానుభూతిపరుడు 2 సెంట్లు స్థలం ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నాడు. వాస్తవానికి 2019లో పంచాయతీ తీర్మానం చేసి ఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఈ స్థలాన్ని కూర్మనాథాలయానికి వచ్చే దూర ప్రాంత భక్తులు ఉండేలా ఉచిత కాటేజీ నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అప్పట్లో భూమిపూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు. స్థల విషయమై హైకోర్టుకు ఒక వ్యక్తి వెళ్లినా రికార్డులు ప్రకారం పంచాయతీ రిజర్వుడు స్థలమని 2022లోనే తీర్పునిచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో సదరు ఆక్రమణదారు పనులు జరుపుకుంటున్నాడు. అదే గ్రామంలో గ్రామకంతం గల పాతబస్టాండ్‌గా పిలవబడే సర్వే నెంబరు 715 బై 4లో 15 సెంట్ల స్థలం ఉంది. గతంలో ఇక్కడ బస్సులు నిలిపేవారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో అక్రమార్కుల కన్నుపడింది. పంచాయతీ రికార్డుల్లో గ్రామకంతం అని ఉన్నా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ రెండు స్థలాల ఆక్రమణదారులకు పంచాయతీ నోటీసులు అందజేసినా పనులు మాత్రం యథేచ్ఛగా జరుగుతున్నాయి. పంచాయతీ రిజర్వుడు స్థలంలో ఎలా నిర్మాణాలు చేపడతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఈ విషయమై గార తహశీల్దార్ ఎం.చక్రవర్తి వద్ద ప్రస్తావించగా రెండు స్థలాలు పంచాయతీ స్థలాలుగానే ఉన్నాయని, రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సారవకోట మండలం చీడిపూడిక గ్రామానికి చెందిన షణ్ముఖరావు (30) ఆదివారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనకాపల్లిలో తాపీ పని కోసం ఈ నెల 10న వెళ్తుండగా తాళ్లవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షణ్ముఖరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్త రిమ్స్‌కు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: నవభారత్ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12 ఆవులు, 5 గేదెలను తీసుకెళ్తుండగా వీటిని పట్టుకున్నారు. తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పశువులను కొత్తవలస గో సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్రమంగా పశువులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆన్‌లైన్ వైద్యంతో అనర్థం

- నెట్‌లో చూసి సొంత వైద్యం చేసుకుంటున్న జిల్లావాసులు
- సొంత వైద్యంతో అనర్థాలను కొని తెచ్చుకుంటున్న వైనం



- కోటబొమ్మాళి మండలానికి చెందిన సుమారు 55 ఏళ్ల వ్యక్తి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జాయినై తనిఖీ చేయించుకుంటే హార్ట్‌లో బ్లాక్ ఉందని తేలింది. అతనికి స్టంట్ వేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ శస్త్రచికిత్స జరుపుతుండగానే అతను మృత్యువాతపడ్డాడు. అంతకుముందు అతను ఐదు రోజుల పాటు ఛాతీలో నొప్పితో బాధపడ్డాడు. గ్యాస్ వల్ల కావచ్చని ఆన్‌లైన్‌లో వెతికి అక్కడ సూచించిన మందులు వాడి తగ్గకపోవడంతో ఆస్పత్రిని ఆశ్రయించాడు. అప్పటికే చేయిదాటిపోయింది.
- నరసన్నపేట మండలానికి చెందిన ఓ వ్యక్తికి జ్వరం, కళ్ల మంటలు, తలనొప్పితో బాధపడ్డాడు. ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి ఈ విషయం చెప్పగా అతను ఆన్‌లైన్‌లో వెతికి మందులను వాడాలని కొన్నింటిని సూచించాడు. వారం రోజులు వాడినా తగ్గకపోవడంతో వైద్యుల వద్దకు వెళ్లగా అతనికి మెదడులో సమస్య ఉన్నట్లు పరీక్షల అనంతరం నిర్ధారించి విశాఖపట్నం తీసుకెళ్లారు.

శ్రీకాకుళం:

జిల్లాలో చాలా మంది ఆన్‌లైన్ వైద్యం వైపు మొగ్గు చూపుతూ మరింతగా అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలోనే ఈ జాఢ్యం ఉండగా ఏఐ లాంటి సైట్లు వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిపోయింది. ఆన్‌లైన్ వైద్యాన్ని నమ్మి, వైద్యులు చెబుతున్న దాన్ని కూడా అనుమానించే పరిస్థితికి కొందరు యువత చేరుకుంటున్నారు. జిల్లాలో రెండు వేలు వరకు మెడికల్, హోల్‌సెల్, రిటైల్ షాపులు ఉన్నాయి. 10 వేల మంది వరకు ఎంబీబీఎస్, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఉన్నారు. 10 పైగా పెద్ద ఆసుపత్రులు ప్రైవేటుగా, ప్రభుత్వ పరంగా వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇవి కాకుండా గ్రామస్థాయిలో 1000 మంది వరకు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఉన్నారు. ఇది వరకు వీరిలో ఎవరినో ఒకరిని సంప్రదించి, వైద్యం చేయించుకునేవారు. ఇటీవల కాలంలో యువత ఈ విధానాన్ని విడిచిపెట్టి ఆన్‌లైన్ బాటపడుతున్నారు. తమకు, తమ బంధువులకు ఉన్న రోగాలను నిర్ధారించుకొని, ఆన్‌లైన్‌లో సూచించినట్లు మందులను వాడేస్తున్నారు. కొందరు లేని జబ్బులకు వైద్యం చేసుకోవడం, మరి కొందరు ఉన్న జబ్బును కూడా అది కాదనుకొని ఆన్‌లైన్‌లో సూచించిన మందులను వాడేయడం వల్ల రోగాన్ని ముదర పెట్టుకుని కష్టాలు పాలవుతున్నారు. ఇటువంటి వైద్యం అనార్థదాయకమని వైద్యులు చెబుతుండగా, దానిని కూడా పెడ చెవిన పెడుతున్నారు. వైద్యులు డబ్బు కోసమే అలా చేస్తున్నారని, వాదిస్తున్నారు. వాస్తవానికి, వైద్యులు రోగిని స్వయంగా పరిక్షించి, అవసరమైతే రక్త పరీక్షలు ఇతర తనిఖీలు చేసి రోగాన్ని నిర్ధారించిన తర్వాతే చికిత్సలు ప్రారంభిస్తారు. ఇవేవీ లేకుండా వైద్యం చేయించుకోవడం వల్ల తీవ్ర నష్టాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లక్షణాలను బట్టి నిర్ధారణ కష్టం



రోగికి ఉన్న లక్షణాలను బట్టి వ్యాధిని నిర్ధారించలేం. ఒకే రకమైన లక్షణాలు అనేక రోగాల్లో ఉంటాయి. రోగిని పరీక్షించి మరికొన్ని తనిఖీలు చేసిన తర్వాతే వాధిని నిర్ధారించగలుగుతాం. ఆన్‌లైన్ చూసి సొంతంగా వైద్యం చేసుకోవడం సరైన పద్ధతి కాదు.

– డాక్టర్ డి.పార్వతి, శ్రీకాకుళం

ప్రమాదకరం



ఆన్‌లైన్‌లో సూచించినట్లు వైద్యం చేసుకోవడం అత్యంత ప్రమాదకరం. జబ్బు తగ్గుతుందో లేదో అటుంచితే కాలాన్ని వృథా చేయడం వల్ల వ్యాధి ముదిరిపోయే ప్రమాదం ఉంటుంది. వైద్యులను నేరుగా సంప్రదించి చికిత్స చేయించుకోవడం ఉత్తమం.

– డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్, శ్రీకాకుళం

వందేళ్ల వృక్షానికి వందనం



కుందువానిపేటలో 100 ఏళ్ల చరిత్ర కలిగిన రావిచెట్టు గ్రామస్తులకు మండుటెండలోనూ చల్లటి నీడను అందిస్తోంది. తరతరాలుగా ఆటలు, పాటలు, విందులు, వినోదాలు, సభలు, సమావేశాలన్నీ ఈ చెట్టు కిందే నిర్వహిస్తుండటంతో ఈ వృక్షరాజానికి గ్రామస్తులకు మంచి అనుబంధం ఏర్పడింది. సుమారు 50 సెంట్ల విస్తీర్ణం గల ఈ చెట్టు వద్ద ఇటీవల అమ్మవారి పండుగలు జరగడంతో పరిసరాలను చక్కగా తీర్చిదిద్దారు.

– శ్రీకాకుళం రూరల్

ఆదిత్యాలయం.. భక్తజన సంద్రం



ఇంద్రపుష్కరిణి వద్ద భక్తులు



క్యూ లైన్లలో భక్తుల రద్దీ

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ మాసం సందడి కొనసాగుతోంది. మూడో ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు, మొక్కుల్లో భాగంగా తలనీలాలు, వైశాఖ మాస ప్రత్యేక సంప్రదాయ పూజల్లో భాగంగా గ్రామీణ మహిళల ప్రసాదాల నివేదన తదితర ప్రత్యేక పూజలు విశిష్టతతో అరసవల్లి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో క్యూ లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ భారీగా భక్తులు తరలి రావడంతో ఈ సౌకర్యాలు పెద్దగా సరిపడలేదనే విమర్శలు వినిపించాయి. భానుడి ప్రతాపం తీవ్రంగా ఉండడంతో కేశఖండనశాల, ఇంద్రపుష్కరిణి పరిసరాలలో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అంతరాలయంలో ప్రత్యేక అలంకరణతో స్వామివారిని సర్వదర్శనాలకు అనుమతించారు.

ఒక్కరోజులోనే రూ.12,29,751 ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.12,29,751 లభించింది. టికెట్ల రూపంలో రూ.8,84,100, పూజలు, విరాళాల రూపంలో రూ.81,496, ప్రసాదాల రూపంలో రూ.2,64,155 కలిపి మొత్తంగా రూ.12,29,751 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌గా సేతుమాధవన్



రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించి బహుమతి అందుకుంటున్న సేతుమాధవన్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ నువ్వా..నేనా అనే విధంగా ఏడు రౌండ్లలో క్రీడాకారులు పోటీపడ్డారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో శ్రీకాకుళంకు చెందిన ఫిడే మాస్టర్ వేలుమహంతి సేతుమాధవన్ ఆరున్నర పాయింట్లు సాధించి రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే విశాఖపట్నంకు చెందిన అభిరామ్ ఆరు పాయింట్లతో ద్వితీయ, విజయవాడకు చెందిన సీనియర్ క్రీడాకారుడు మల్లేశ్వరరావు తృతీయ స్థానంలో నిలిచారు. ఎస్.కోటకు చెందిన వినీల్‌కార్తీక్ నాలుగో స్థానం, విశాఖపట్నంకు చెందిన జయనాగరాజు ఐదవ స్థానంలో నిలిచారు. ఓపెన్‌లో పది మందికి, అండర్–17 విభాగంలో పది మందికి, వివిధ కేటగిరీల్లో మొత్తం 30 మంది క్రీడాకారులకు రూ.1.30 లక్షలు నగదు బహుమతితో పాటు మెమోంటోలు, ప్రశంసా పత్రాలు జీఎంఆర్ ఐటీ తరపున అందించారు. ఈ టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటార్‌గా కేవీ జ్వాలాముఖి వ్యవహరించగా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అరుణ్‌కుమార్ వ్యవహరించారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముఖ్య అతిథిగా హాజరైన జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్ వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత శ్రీకాకుళం



విజేత జట్టుతో నిర్వాహకులు

తగరపువలస: విశాఖపట్నం జిల్లా మధురవాడలోని శాప్ గ్రౌండ్‌లో ఈ నెల 23న గ్రాస్ రూట్స్ డే సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్–2025లో శ్రీకాకుళం ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. అండర్ బాయ్స్ జట్టు రన్నరప్ సాధించింది. ఉత్తరాంధ్ర జోనల్ అండర్–14 బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆదివారం ట్రోఫీలు అందజేశారు.

కార్యక్రమంలో డీఎస్డీవో జూన్ గాలియట్, లోసో సుష్మిత, రాకేష్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ నరసింహారెడ్డి, జిల్లా ఒలింపిక్స్ ఎగ్జిక్యూటివ్ శరత్, వీడీఎఫ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎస్‌జీ రామకృష్ణ, స్టార్ ఫెక్స్ సన్నిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐటీఐ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 24తో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలు మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్ సిద్ధం చేస్తామని ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ ఆదివారం చెప్పారు. మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా పారదర్శకంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

మత్స్యకారుడు మృతి



ఉప్పుగెడ్డ సంగమం వద్ద గురుమూర్తి మృతదేహం

పోలాకి: మండలంలోని రాజారాంపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు దొలపల్లి గురుమూర్తి(52) వేటకు వెళ్లి మృతిచెందాడు. ఉప్పుగెడ్డ సంగమంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న వంశధార నదిలోకి ఆదివారం వేకువజామున వేటకు వెళ్లగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సీఐ ఎం.శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.